

యువతకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు

పార్వతీపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణచైతన్య శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిప్లమో లేదా బీఏ, బీఎస్సీ బీకాం, బీసీఏ, బీబీఏ, బీ-ఫారం పూర్తయిన వారు అర్హులని పేర్కొన్నారు. 21-24 మధ్య వయసున్న అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ 96769 65949 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలన్నారు.


శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో బాలికలు

సంక్రాంతి సందడి

● జిల్లాలో ముందస్తుగా సంబరాలు ● సంప్రదాయం ఉట్టిపడేలా వేడుకలు ● అలరించిన ప్రదర్శనలు ● పాల్గొన్న మంత్రి, కలెక్టర్

పార్వతీపురం/బెలగాం/సాలూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. సంప్రదాయం ఉట్టిపడేలా శనివారం ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. ఇందులో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములయ్యారు. మొత్తంగా అంతటా సందడి వాతావరణం నెలకొంది. సాలూరు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సంబరాల్లో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోగి మంట వేశారు. ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. స్థానిక మహిళలతో కలిసి రంగవల్లులు తీర్చిదిద్దారు. పార్వతీపురం కలెక్టరేట్ ముఖద్వారం నుంచి ప్రధాన రహదారి గేటు వరకు వేసిన రంగువల్లులను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తిలకించారు. సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా, వినూత్నంగా ముగ్గులు వేసిన మహిళలు, విద్యార్థినులను ఆయన అభినందించారు. జిల్లా ప్రతిష్ఠను పెంపొందించేలా రెండు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం జిల్లా వాసులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన ఎస్.గౌరమ్మ, జి.శ్రావణి, కె.పవిత్ర తదితరు లకు బహుమతులు అందిం చారు. స్త్రీశిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఆర్వో కె.హేమలత, ఐసీడీఎస్ పీవో కనకదుర్గ, పార్వతీపురం ఎంఈవో విమలకుమారి, సీడీపీవోలు పాల్గొన్నారు.


సాలూరులో భోగిమంట వెలిగిస్తున్న మంత్రి సంధ్యారాణి


ముగ్గులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తదితరులు


థింసా నృత్యంతో అలరించిన విద్యార్థినులు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. తప్పెటగుళ్లు, కోలాటం ప్రదర్శనలు, టీవీ నటుడు శాంతి కుమార్ మిమిక్రీ , జానపద, కూచిపూడి, థింసా బృంద నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దంపతులు, సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు, తదితరులు ఆయా ప్రదర్శనలను ఆద్యంతం తిలకించారు.

పండగ రద్దీ

● కిటకిటలాడుతున్న బస్, రైల్వే స్టేషన్లు


పాలకొండలో..

పార్వతీపురం టౌన్/ పాలకొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి సమయం సమీపిస్తుండడంతో జిల్లాకు చెందిన వలస పక్షులు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. దీంతో జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. బస్సులు, రైళ్లు, ప్రైవేట్ వాహనాలు ప్రయాణికులతో రద్దీగా మారుతున్నాయి. పండగ సెలవుల నేపథ్యంలో విద్యార్థులతో పాటు అన్ని వర్గాల వారు కుటుంబాలతో స్వస్థలాలకు పయన మవుతున్నారు. అయితే అదనపు సర్వీసులు ఏర్పాటు చేసినా.. తీవ్ర రద్దీ ఉండడంతో బస్సులు దొరక్క ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బస్సు కనిపిస్తే చాలు పరుగులు తీస్తున్నారు. సీటు కోసం ఎగబడుతున్నారు. మొత్తంగా అష్టకష్టాలు పడుతూ గమ్య స్థానాలకు చేరుకుంటున్నారు. జిల్లా కేంద్రం పార్వతీపురంలోని రైల్వే, బస్‌స్టేషన్లలో ప్లాట్‌ఫాంలన్నీ ప్రయాణికులతో కిటకిటలాడాయి. వలస పక్షుల రాకపోకలతో జిల్లా కేంద్రం కిక్కిరిసి పోయింది.

పాలకొండ నుంచి ప్రత్యేక సర్వీసులు

సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకొని పాలకొండ ఆర్టీసీ డిపో నుంచి విశాఖకు 29, విజయవాడ, హైదరాబాద్‌కు రెండు బస్సులు నడుపుతున్నట్టు డీఎం వెంకటేశ్వరరావు తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురం, రాజాం తదితర ప్రాంతాలకు అదనపు సర్వీసులు నడుపుతున్నామని, చార్జీలు పెంచలేదని వెల్లడించారు. ఇదిలా ఉండగా విశాఖపట్నం, విజయవాడకు నడుపుతున్న ప్రైవేటు బస్సు చార్జీలు మాత్రం పెరిగాయి. నిన్న మొన్నటి వరకు విజయవాడకు రూ.800 తీసుకోగా.. ప్రస్తుతం రూ.300 అదనంగా వసూలు చేస్తున్నారు.


పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు


ఓబన్న చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్

వడ్డే ఓబన్నకు ఘన నివాళి

పార్వతీపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని శనివారం కలెక్టర్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని సవాల్ చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ప్రధాన అనుచరుడైన ఓబన్న ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. బ్రిటీష్ పాలకులతో వీరోచితంగా పోరాడి అమరుడయ్యారని తెలిపారు. ఓబన్న పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

గోడౌన్ లేక.. నిల్వ చేసుకోలేక..

● పత్తి కొనుగోలుకు ఇక్కట్లు

భామిని, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భామినిలో ఎట్టకేలకు పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ గోడౌన్ సదుపాయం లేకపోవడంతో అటు సిబ్బంది.. ఇటు రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. కొద్ది రోజుల కిందట భామిని ఏఎంసీలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడే ఉన్న వేర్ హౌసింగ్‌లో రైతుల నుంచి సేకరించిన పత్తిని నిల్వ చేసుకునేవారు. అయితే స్టాక్‌ను అక్కడ ఉంచేందుకు వీలు లేదని, కొనుగోలు కేంద్రాన్ని కూడా తరలించాలని వేర్ హౌసింగ్ అధికారులు తేల్చి చెప్పారు. దీంతో అక్కడున్న స్టాక్‌ను రామభద్రపురం మిల్లుకు తరలించారు. స్థానికంగా ఉన్న రైతు సేవా కేంద్రంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వేర్ హౌసింగ్ గోడౌన్ వరండాలో ఉన్న కొంత స్టాక్‌ను రామభద్రపురానికి తరలిస్తున్నారు. సంక్రాంతి సెలవుల తర్వాత గోడౌన్ ఏర్పాటు చేస్తేనే పత్తిని కొనుగోలు చేస్తామని సీసీఐఎల్ అధి కారి అతుల్‌తెండర్వినాథ్ తెలిపారు. ఇప్ప టివరకు 900 క్వింటాళ్లను కొనుగోలు చేశామన్నారు.


గోడౌన్ వరండాలోనే ఉన్న పత్తి



గోదాదేవికి ఘనంగా పూజలు

6లో

● 108 కలశాలతో ప్రసాద నివేదన

రైలు పట్టాలపై ట్రాక్టర్ రయ్..రయ్!

● రైల్వే లైనులో మూడో ట్రాక్ నిర్మాణ పనుల్లో వినియోగం
● ఆసక్తిగా తిలకించిన స్థానికులు

6లో

మళ్లీ రావాల పాత రోజులు

● అందరూ కలసి సేసుకోవాల మన పండుగ
● గ్రామీణుల్లో ఆశాభావం

మినీ గోకులాలు ప్రారంభం

8లో

ఆరోగ్య సేవలపై నిర్లక్ష్యం వద్దు

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు
● గ్రామాల్లో వైద్య సేవలపై ఆరా



వైద్యులు ఎప్పుడొస్తారో?

● ఆయుర్వేదిక్, హోమియో డిస్పెన్సరీలను వేధిస్తున్న సిబ్బంది కొరత
● పలుచోట్ల మూతపడిన వైనం ● ఇబ్బంది పడుతున్న రోగులు
● కూటమి ప్రభుత్వం స్పందించాలని విన్నపం

జియ్యమ్మవలస, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆయుర్వేదిక్, హోమియో డిస్పెన్సరీలను వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. గత వైసీపీ సర్కారు పోస్టుల భర్తీకి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో కొంత కాలంగా రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యాధికారులు, సిబ్బంది లేకపోవడంతో ఆయుర్వేదిక్, హోమియో డిస్పెన్సరీల పరిస్థితి దారుణంగా మారింది. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి..

● జిల్లాలో 12 ఆయుర్వేదిక్, ఏడు హోమియో డిస్పెన్సరీలు ఉన్నాయి. జియ్యమ్మవలస, రస్తాకుంటుబాయి, బూర్జ, మక్కువ, దుగ్గేరు, సాలూరు, సీతంపేట, కవిరిపల్లి, సీతానగరంలో ఉన్నవి రెగ్యులర్ ఆయుర్వేదిక డిస్పెన్సరీలు. జోకిశీల, రావివలస, అన్నవరంలో కాంట్రాక్టు బేసిక్ డిస్పెన్సరీలు ఉన్నాయి. అయితే దుగ్గేరు డిస్పెన్సరీకి పూర్తిగా తాళం వేసేశారు. మిగిలిన 11 డిస్పెన్సరీల్లో బూర్జ, కవిరిపల్లి, అన్నవరం డిస్పెన్సరీల్లో మాత్రమే వైద్యాధికారులు ఉన్నారు. మిగిలిన చోట్ల అసలు వైద్యులే లేరు. దీంతో దీంతో కాంపౌండర్లే డాక్టర్లుగా విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏళ్ల తరబడి కొనసాగుతోంది.

● హోమియో డిస్పెన్సరీల విషయానికొస్తే.. జిల్లాలో పార్వతీపురం, గరుగుబిల్లి, తలవరం, బాసూరులలో రెగ్యులర్ డిస్పెన్సరీలు ఉన్నాయి. ఇందులో గరుగుబిల్లి, తలవరం, బాసూరులో డిస్పెన్సరీలు మూతపడ్డాయి. ప్రస్తుతానికి పార్వతీపురంలో మాత్రమే రెగ్యులర్ డిస్పెన్సరీ నడుస్తోంది. కాంట్రాక్టు డిస్పెన్సరీల్లో గళావళి మినహా మర్రిపాడు, కుసిమిలోనే వైద్యులున్నారు. విజయనగరం జిల్లాలో కూడా 16 ఆయుర్వేదిక్, 16 హోమియో, రెండు యునాని డిస్పెన్సరీలు ఉన్నాయి. ఇక్కడ కూడా చాలా చోట్ల వైద్యాధికారులు లేరు. దీంతో ఉమ్మడి జిల్లావాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

పది రోజుల్లో భర్తీ చేస్తాం

హోమియో, ఆయుర్వేదిక్, యునాని డిస్పెన్సరీల్లో వైద్యాధికారుల పోస్టులు భర్తీ చేస్తాం. ఇప్పటికే సర్టిఫికేట్ల వెరిఫికేషన్ చేసి పోస్టింగ్ ఆర్డర్లు కూడా ఇచ్చాం. మరో పది రోజుల్లో పూర్తిస్థాయిలో వైద్యులు వచ్చి జాయిన్ అవుతారు.

- ఝాన్సీలక్ష్మి, రీజనల్ డైరెక్టర్, విశాఖపట్నం


జియ్యమ్మవలస ఆయుర్వేద వైద్యశాల ఇలా..

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ







ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి






కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మీ (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

మళ్లీ రావాల పాత రోజులు

- అందరూ కలసి సేసుకోవాల మన పండుగ
- గ్రామీణుల్లో ఆశాభావం



విజయనగరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి)

● 'ఏటిరోయ్ ఎంకటేసు ఎప్పుడొచ్చినావురా?' ఆప్యాయంగా అడిగాడు నూకరాజు.

➡ ఓరి నూకా ఏటి సెప్పమంతావురా? బాగా పొద్దుపోనాది. నిన్న రాత్రి లాస్టు బస్సుకొచ్చినానురా. గొప్ప సలిరా. నానెప్పుడూ ఇంత సలిని సూడ లేదురా. బస్సు మీదొచ్చినపుడు వనికిపోనాను. ఇజయనగరం రైలుటేసిన్‌లో దిగినప్పుడే పొద్దుపోనాదిరా. బస్టాండ్‌కొచ్చి బస్సెక్కీసి నాను. మరి ఇంకేటి సంగతులురా?.. తిరిగి ప్రశ్నించాడు ఎంకటేసు.

● 'బెంగులూరులో పని ఎలాగుందిరా?'.. కుతూహలంగా అడిగాడు నూకడు.


➡ 'ఏం పని... ఏం బతుకురా? ఊర్లోన ఉన్నంత హాయి రాదురా. ఏటయినా ఊరు ఊరేనిరా. అక్కడుంతే యంత్రమనుకో. ఒక సరదా ఉండదు.. సంతోసం ఉండదు. టౌన్‌లో ఉన్నామన్న మాటే గానీ, మనంత అభిమానం అక్కడ మనుసుల్లో ఉండదురా. పోనీ ఊర్లో ఉంతామంతే ఆదాయముండదురా. పిల్లల సదువులు, పెల్లుల్లు, కట్టం సుఖానికి డబ్బులు ఉండాలి కదరా. యవసాయం పెద్దగా గిట్టుబాటు కాదురా. అక్కడైతే రోజంతా కట్టపడితే ఎయ్య రూపాయలు దొరుకుతాయిరా. అంత ఆదాయం ఇక్కడ దొరకదు కదరా. పోనీ నా తగువేనికి గానీ... నీ పరిత్తితేటిరా నూకా?'.... ప్రశ్నించాడు ఎంకటేసు.

● 'ఏటి సెప్పమంతావురా.. నీలాగ తెగించి పట్నం రాలేనురా. నానొత్తే యవసాయం ఎవులు సెత్తార్రా? అప్పుడంతే కౌలుకు ఇచ్చేవాల్లం. కానీ ఇప్పుడు ఎవుడూ యవసాయం సెయ్యడు. అలాగని ఉన్న భూమి వదులుకుంతామా?. అందుకే కట్టమైనా.. నట్టమైనా యవసాయం సేత్తన్నను. యవసాయం సేలా ఇబ్బందిరా. మొన్న ఇలాగ సేను కోసినామో లేదో వాన పట్టుకుందిరా. సేలా రోజులు సికండిలాగా వదల్లేదు. సేని తడిసి పడిపోయిది. పొలంలో దానిం రాలిపోయి నయి. మొలకలు వచ్చినాయిరా. శాలా లాస్ అయిపోనాం. కుటమాంతోని కట్టపడ్డామా. ఆ కట్టానికి తగినట్టు కూడా రాలేదురా. అందుకే ఈ ఏడు యవసాయం సెయ్యను అనుకుంతన్నాను. నీతోనే వత్తానురా. నాకు పని సూడురా'.. అని కోరాడు నూకరాజు.

➡ 'పోనీలేరా నూకా. పని సూత్తాను కానీ. నీవు ఉండలేవురా. ఊరికి అలవాటు పడినోడవు. మన ఊరిలాగా కాదురా. అక్కడ పలకరించినోలుండర్రా. నెల తిరిగే సరికి డబ్బులైతే ఉంతాయిరా. ఆ డబ్బు సూసి పొంగిపోడమే గానీ.. ఏముండదురా. పిల్లల సదువులు, పెల్లిల్ల కోసం తప్పదు ఉండాలంతే ఉండాలి. మనసు అంగీకరించదు రా. సెప్పురా నూక. మనం సిన్నప్పుడు ఎంత హాయిగా ఉండేవాలమో. అందరం గంజి నీలు తాగి బతికినోలుమే గదరా. కానీ ఇప్పుడు అలాగున్నాదేటిరా పెపంచం? అల్లాడు డబ్బులు గడించినాడు.. అల్లాడు పిల్లలకు బాగా సూత్తన్నాడు. సదివిత్తన్నాడు...ఇదే గదా ఇప్పుడు వరస. ఆడినీ.. ఈడినీ సూసి పట్నమెలతన్నంరా. పోనీ పంటలైనా పండతన్నాయా అంతే అదీ లేదు. పొలానికి నీరు అవసరమైనపుడు వాన పడదు. అవసరం లేనపుడు వాన కురిసి తెగ కట్ట పెట్టేత్తన్నాది. అందుకే ఆ బతుకేదో టౌన్‌లో అయితే జీతం గేరెంటీ గదరా. అందుకే కట్టమైనా టౌన్ ఎలతన్నాను. పోనీలేరా. మీ ఇంటోల్లతో మాటాడి సెబితే... కాంటాక్టరు బాబుకు నాను సెబుతాను. పండుగ ఇరిగితే నాతో పాటు వత్తువు గానీ. ఒరే పండుగంతే గుర్తొచ్చింది... ఏట్రా పండుగ సరదా నేదు.'... ఎంకటేసు నిట్టూర్చాడు.

● 'ఏం పండుగురా ఎంకటేసు. తొలిలాగా ఊర్లోనా పెద్దగా సందడి నేదు. కుర్రాలున్నారంతే సెల్‌పోన్లు పట్టుకుంతన్నారు. ఆడోలు సీరియల్లు, సినిమాల్లో పడిపోతన్నారు. మందేసినోడు మందేసుకుంతన్నాడు. అందుకేనిరా పెద్ద సరదా నేదు. అప్పుడు మన టైములో పండుగంతే పండుగేనిరా. అందరం కొత్త బట్టలు ఏసుకొని అమ్మోరు దగ్గిరికి ఎల్లోలం కదరా. రాత్రిదాకా ఆటలు, పాటలు ఆ సరదా యేరులేరా. మనుసులు మారిపోనారు. కాలం మారిపోనాది. ఆ సరదా.. ఆ సందడి.. ఆ పేమలు, బంధాలు ఇప్పుడు లేవురా.'. బాధ పడ్డాడు నూకడు.

➡ 'పోనీలేరా. గుర్తు తెచ్చుకొని ఆనంద పడిపోదుమ. మల్లీ పాత రోజులు రావాలిరా.. మనూర్లో ఆ పండుగ సందడి కనిపించాలిరా. వత్తాయనే ఆశ ఉందిరా. మరి ఎల్లొత్తానురా. అలాగ ఈదిలో పనుంది' అంటూ కదిలాడు ఎంకటేసు.





సాలూరు రూరల్: కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో...

గోదాదేవికి ఘనంగా పూజలు

సాలూరు రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసోత్సవాల సందర్భంగా గోదాదేవికి ఆలయాల్లో ఘనంగా పూజలు చేస్తున్నారు. సాలూరు కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, పెదకోమటిపేట రామాలయంలో గోదా రంగనాథ స్వామికి కూడారై వెల్లుం (విశేష ప్రసాద సేవ)ను శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి 108 కలశాలతో ప్రసాద నివేదన చేశారు. అర్చకులు నారాయణాచార్యులు, ఉదయ భాస్కరాచార్యులు, శ్యామాచార్యుల ఆధ్వర్యంలో రెండు ఆలయాల్లోనూ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. తిరుప్పావైను పఠించారు.అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. వంగపండు రాజేంద్రప్రసాద్, టెక్కలి ధర్మారావు, ఉల్లి రాజేష్, బలభద్రుని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో...

బొబ్బిలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా శనివారం బొబ్బిలి పట్టణంలోని వివిధ వైష్ణవాలయాల్లో కూడా రైవెల్లుం (ప్రత్యేక ప్రసాద నివేదన) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజామున ధనుర్మాస పూజలు, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు ముగిసిన అనంతరం స్వామివారికి ప్రసాదం సమర్పించారు. స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయం తోటలో నీరాటోత్సవం (ఆండాళ్ అమ్మవారికి స్నానం), కూడారై కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కంచరవీధి కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, సింగారపు వీధి, స్వామివారి వీధి, వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో కూడారై వెల్లుం కార్యక్రమాన్ని అర్చకులు, ధర్మకర్తలు శ్రీనివాసాచార్యులు, గెంబలి శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



సింగారపు వీధి వైభవ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో..

వేణుగోపాలునికి నవనీత సేవ..

శృంగవరపుకోట రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఎస్.కోట వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం ధనుర్మాసం సందర్భంగా స్వామి వారికి నవనీత సేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



నవనీత అలంకరణలో వేణుగోపాలస్వామి



రైలు పట్టాలపై ట్రాక్టర్ రయ్..రయ్!

బొబ్బిలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలపై రైళ్లు తప్ప ఇంకేవీ ప్రయాణించలేవని అందరికీ తెలిసిందే. కానీ బొబ్బిలిలో ఓ ట్రాక్టర్ రైలు పట్టాలపై రయ్ రయ్‌మంటూ పరుగులు తీస్తుంటే అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. విశాఖ-రాయపూర్ రైల్వే లైనులో మూడో ట్రాక్ నిర్మాణ పనులు కొంతకాలంగా సాగుతున్నాయి. దీని కోసం అవసరమైన నిర్మాణ సామగ్రిని తరలించేందుకు ట్రాక్టర్‌కు రైలు చక్రాలను అమర్చారు. పట్టాలపై నడిచేందుకు వీలుగా ట్రాక్టర్ ముందు భాగానికి, వెనుక ట్రాలీకి చక్రాలు అమర్చడంతో అది ఎంచక్కా పరుగులు తీస్తోంది. దీని పరుగులను స్థానికులు సెల్‌ఫోన్ కెమెరాల్లో భద్రపరుచుకుంటున్నారు.

13న ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

విజయనగరం క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 13న భోగి పండుగ సందర్భంగా సెలవుగా ప్రకటించిన నేపథ్యంలో పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేస్తున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

శ్మశానాల్లో బోర్లు పనులు

జామి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాగరంలోని రెండు శ్మశానాల్లో బోరు బావుల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. శ్మశానాల్లో బోరు బావులు ఏర్పాటు చేయాలని చాన్నాళ్లుగా స్థానికులు కోరినా పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఎటకేలకు కూటమి ప్రభుత్వం వారి కలను నిజం చేసింది. సర్పంచ్ వసి పార్వతి ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి.

అవగాహనతోనే క్షయ నివారణ

సంతకవిటి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి సోకిన వారు జాగ్రత్తలు వహిస్తే పూర్తిగా నయమవుతుందని టీబీ సూపర్‌వైజర్ పి.వేణుగోపాల్ తెలిపారు. శనివారం మోదుగులపేటలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చిన్నవాడు, హెచ్‌వీ కె.నిర్మల, హెచ్ఎ బి.శంకరరావు, మెడికల్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

షర్మిలను కలిసిన కుప్పిలి



రాజాం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విశాఖలో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలను రాజాం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కుప్పిలి చైతన్యకుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజాం నియోజకవర్గంలో పలు సమస్యలపై చర్చించారు. ఈ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి సకాలంలో పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని షర్మిల హామీ ఇచ్చారని కుప్పిలి తెలిపారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

నెల్లిమర్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీరామ్‌నగర్ కాలనీలోని బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో స్థానిక అశ్విని ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ జమ్ము వేణుగోపాల్ 237 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి ఉ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధి బ్రహ్మదేవ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

వినూత్నంగా వలంటీర్ల నిరసన

విజయనగరం దాసన్నపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వలంటీర్లను కొనసాగిస్తామని గతంలో మాట నిలబెట్టుకోలేదని చెవిలో పువ్వులు పెట్టుకుని వలంటీర్లు శనివారం నిరసన తెలిపారు. గంటస్తంభం నుంచి ఎన్టీ ఆర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగిస్తామని, రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికైనా మాట నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రంగరాజు, రామకృష్ణ, వాసు పాల్గొన్నారు.

కోడి పందేలపై నిఘా పెట్టండి

జామి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ నేపథ్యంలో గ్రామాల్లో కోడి పందేలు జరగకుండా ఆయా పంచాయతీల వీఆర్‌వోలు నిఘా పెట్టాలని డిప్యూటీ తహశీల్దార్ మూర్తి ఆదేశించారు. శనివారం సాయంత్రం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలతో ఆయన సమావేశం నిర్వహించారు.

అప్పలనాయుడుకు పరామర్శ



అప్పలనాయుడుతో మాట్లాడుతున్న సువ్వాడ

నెల్లిమర్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్డపేటకు చెందిన పున్నాన అప్పలనాయుడును టీడీపీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ శనివారం పరామర్శించారు. అప్పలనాయుడుకు చెందిన ఇల్లు షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైన నేపథ్యంలో ఆయన్ని కలిసి ఓదార్చారు. ప్రమాదం పూర్వపరాలు తెలుసుకున్నారు.

పనులు పూర్తిచేయండి

రాజాం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గోకులాల పనులు సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఒమ్మిలో నిర్మాణంలోని గోకులాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం రోడ్డు పనులను పరిశీలించారు. ఆయనతో సర్పంచ్ వంగా వెంకటరావు ఉన్నారు.

పెన్సిల్ ముల్లుపై వివేకానందుడు



లక్కవరపుకోట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద జయంతి సందర్భంగా మండలంలోని దెందేరు హైస్కూల్ డ్రాయింగ్ టీచర్ శివ.. పెన్సిల్ ముల్లుపై వివేకానంద రూపాన్ని చెక్కారు. పెన్సిల్ ముల్లుపై వివేకానందుడి రూపం సుందరంగా తీర్చిదిద్దడంతో ఆయన్ని పలువురు ప్రశంసించారు.

చిరు వ్యాపారులకు 'కూటమి' చేయూత

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మొక్క నాటుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, జనవరి11 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులకు చేయూత అందజేసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం గజపతినగరంలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామీణ కూరగాయల మార్కెట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులు ఆర్థికంగా ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇప్పటికే డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు వ్యాపార నిమిత్తం కోట్లాది రూపాయల రుణాలు అందజేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్ఫూర్తితో రైతు బజార్లను ఏర్పాటు చేసి దళారీ వ్యవస్థను అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కూరగాయల రైతులకు గిట్టుబాటుధర సమకూర్చడంతో పాటు వారికి సబ్సిడీపై రుణాలు, యాంత్రీకరణ పరికరాలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఇప్పటికే గతంతో పోల్చుకుంటే ఈ సంక్రాంతి పండగకు ముందే రోడ్ల పరిస్థితి ఎంతో మెరుగుపడిందన్నారు. ఈ సందర్భంగా అయన కూరగాయల మార్కెట్‌లో మొక్క నాటారు. సహకార భారతి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీజీఎం నాగార్జున, డీసీవో రమేష్, ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, టీడీపీ సీనియర్ నాయకులు పి.వి.వి. గోపాలరాజు, మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, శీరంరెడ్డి రామ్‌కుమార్, ప్రదీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నూతన విధానాలతో పండితులకు అన్యాయం



వినతిపత్రం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

విజయనగరం రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ బోర్డు ప్రతిపాదించిన నూతన విద్యా విధానాలతో తెలుగు, హిందీ, సంస్కృత పండితులకు అన్యాయం జరుగుతుందని సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు చోడిశెట్టి రామగోపాల్, ఎ.భాస్కరరావు, రమణ, యామిని తదితరులు అన్నారు. శనివారం మహారాజా సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ పి.జనార్దననాయుడుకు శనివారం వినతిపత్రం అందజేశారు. భాషా పండితులకు అన్యాయం జరిగే ఇలాంటి విధానాల విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. దీనిపై సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మెయిల్ ద్వారా ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తానన్నారు.

వెయిట్ లిఫ్టర్ చంద్రికకు ఘన స్వాగతం



చంద్రికను ఊరేగిసున్న దృశ్యం

నెల్లిమర్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలో జరుగుతున్న ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించిన బయిరెడ్డి చంద్రికకు స్వగ్రామం నెల్లిమర్లలో శనివారం ఘన స్వాగతం లభించింది. పోటీల్లో విజేతగా నిలిచి రైలులో తిరుగు ప్రయాణమై స్వస్థలం నెల్లిమర్ల చేరుకున్న చంద్రికకు నెల్లిమర్ల ముఖద్వారం ఊటగెడ్డ ప్రాంతానికి భారీ సంఖ్యలో అభిమానులు, గ్రామస్థులు చేరుకుని ఘన స్వాగతం పలికారు. పూలదండలు వేసి సత్కరించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. చంద్రికను ఓపెన్ టాప్ కారులో నెల్లిమర్ల మెయిన్ రోడ్డులో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు బయిరెడ్డి రమణ, సరోజినిలతో పాటు గ్రామపెద్దలు, టీడీపీ నాయకులు బయిరెడ్డి నాగేశ్వరరావు, లెంక అప్పలనాయుడు, నడిపేన నారాయణరావు, బయిరెడ్డి కల్యాణ్‌చక్రవర్తి, కలిశెట్టి కన్నంనాయుడు, చందక శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓబన్న జీవితం.. భావితరాలకు స్ఫూర్తిదాయకం

● కలెక్టర్ అంబేడ్కర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ అంబేడ్కర్



నివాళి అర్పిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం కలెక్టరేట్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో సిపాయిలు తిరుగుబాటుకు ముందు స్వతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నర్సింహారెడ్డితో కలిసి వడ్డే ఓబన్న బ్రిటీష్ వారితో వీరోచితంగా పోరాడారని కలెకర్ అంబేడ్కర్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఓబన్న జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్వి, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, బీసీ సంక్షేమాధికారి పెంటోజీరావు ఉన్నారు.

●విజయనగరం క్రైం: స్వాతంత్ర్య సమరయోధుడు రేనాటి ప్రాంతానికి చెందిన వడ్డే ఓబన్న జయంతిని శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్పీ వకుల్ జిందాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఓబన్న బ్రిటీష్ ఈస్టు ఇండియా కంపెనీపై తిరుగుబాటు చేసిన స్వాతంత్ర్య సమరయోధుడన్నారు. రేనాటి ప్రాంతానికి చెందిన పాలేగాళ్లకు ఈస్టు ఇండియా ఇచ్చే భత్యం విషయంలో ప్రారంభమైన ఘర్షణలు క్రమేపీ సాయుధ పోరాటం మారిందన్నారు. ఈ సాయుధ పోరాటంలో పాల్గొన్న ఉయ్యాలవాడ నర్సింహారెడ్డికి.. ఓబన్న సైనికాధ్యక్షుడిగా వ్యవహరించి ఈస్టు ఇండియా బ్రిటీష్ సైన్యాన్ని పరుగులు పెట్టించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. అటువంటి సమరయోధుడి త్యాగాలను భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా బాధ్యత వారి మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీలు యూనివర్స్, ఎస్‌బీ సీఐలు లీలారావు, చౌదరి, ఆర్ఐ గోపాలనాయుడు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు కిమిడి పరామర్శ



వెంకటరావును పరామర్శిస్తున్న కళావెంకటరావు

రాజాం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీ పరిధిలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు కొత్తా వెంకటరావు, గ్రంధి చినవెంకటరాజులను చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు శనివారం పరామర్శించారు. ఇటీవల కొత్తా వెంకటరావు తల్లి సూర్యకాంతమ్మ, గ్రంధి చినవెంకటరాజు భార్య సరస్వతమ్మ మృతి చెందిన నేపథ్యంలో వారిని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు టంకాల వెంకటేశం ఉన్నారు.

సీఎం సహాయనిధి అందజేత

లక్కవరపుకోట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): లక్కవరపుకోటలోని తన నివాసంలో పెదిరెడ్ల పద్మావతి, ఎం.అప్పలకొండ కుటుంబాలకు రూ.6.60 లక్షల సీఎం సహాయ నిధిని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీవినీ ఎరగని రీతిలో బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థికసాయం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కె.బి.ఎ.రాంప్రసాద్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, ఆర్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత సభ్యత్వం తీసుకున్న కోండ్రు



ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శనివారం టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. శదనివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ఇప్పటికే రాజాం నియోజకవర్గంలో 40 వేల సభ్యత్వాలు నమోదు చేయించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ సభ్యత్వాలు తీసుకున్న వారి సంఖ్య 95 లక్షలు దాటిందన్నారు. సభ్యత్వాల సంఖ్య కోటి దాటే అవకాశం ఉందని కోండ్రు పేర్కొన్నారు.

బుచ్చి అప్పల రాంప్రసాద్ కూడా..



టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాంప్రసాద్

లక్కవరపుకోట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి భర్త బుచ్చి అప్పల రాంప్రసాద్ శనివారం టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఆయన ఎస్.కోట నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. 1996 నుంచి 2001 వరకు జడ్పీటీసీ సభ్యుడిగా, 2006 నుంచి 2011 వరకు ఎంపీపీగా సేవలందించారు. 2020 నుంచి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా కొనసాగుతున్నారు. రాంప్రసాద్ శాశ్వత సభ్యత్వం తీసుకోవడంపై పార్టీ నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

గోకులాలను సద్వినియోగం చేసుకోండి



వేపాడ: గోకులానికి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి



విజయనగరం రూరల్: రాకోడులో ప్రారంభిస్తున్న యశస్విని

వేపాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మంజూరు చేస్తున్న మినీ గోకులాలను సద్వినియోగపర్చుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శనివారం మండలంలోని సోంపురంలో రైతు ఆకుల జగ్గయ్య నిర్మించుకున్న మిని గోకులాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోందన్నారు. మండలానికి 121 మినీ గోకులాలను మంజూరు చేసిందన్నారు. ఒక్కో గోకులానికి రూ.1.80 లక్షలు చెల్లిస్తోందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహరావు, ఎంపీడీవో సూర్యనారాయణ, ఏపీవో ఆదిలక్ష్మి, మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి, లక్కవరపుకోట జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, కొట్యాడ రమణమూర్తి, ఎస్.కోట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఒబ్బిన సత్యనారాయణ,సుంకరి అప్పారావు పాల్గొన్నారు.

●చీపురుపల్లి: పట్టణంలోని పిల్లపేటలో మీసాల చిన్నారావు నిర్మించిన మినీ గోకులాన్ని కూటమి నాయకులు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రౌతు కామునాయుడు, కూటమి నాయకులు దన్నాన రామచంద్రుడు, విసినిగిరి శ్రీనివాసరావు, ముల్లు రమణ, గవిడి నాగరాజు, మీసాల కాశీ, ఇజిరోతు రాంబాబు, కోట్ల కృష్ణ, ఆరతి సాహు పాల్గొన్నారు.

●విజయనగరం రూరల్: మండలంలోని రాకోడు, కోరుకొండపాలెం, గుండాలపేటల్లో నిర్మించిన గోకులాలను జనసేన నాయకురాలు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, వేచలపు శ్రీను, రాజేష్‌వర్మ తదితరులున్నారు

●జామి: అన్నంరాజుపేటలో కూటమి ముఖ్య నాయకులు శనివారం గోకులాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

క్రైం న్యూస్

గని బంటాలో పడి వ్యక్తి మృతి

చీపురుపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదనడిపల్లి సమీపంలోని సర్వాగీ కంపెనీకి చెందిన గని బంటాలో పడి కొంగరాపు రాములు మృతి చెందారు. చీపురుపల్లి ఎస్ఐ ఎల్.దామోదరరావు, స్థానికుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరివిడి మండలంలోని శివరాం గ్రామానికి చెందిన రాములు కొంత కాలంగా మతి స్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. గత ఐదు రోజులుగా కనిపించకుండా పోయిన రాములు శనివారం ఉదయం పేరిపి సమీపంలో పరమేశ్వరి గని బంటాలో శవమై తేలాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి మృత దేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై ఎస్ఐ కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..

డెంకాడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నాతవలస ఆర్అండ్‌బీ రహదారిపై శనివారం జరిగిన ప్రమాదంలో అస్సాం రాష్ట్రానికి చెందిన వ్యక్తి (40) మృతి చెందారు. విజయనగరం నుంచి నాతవలస వెళ్తున్న లారీ ఢీ కొనడంతో అతడి తలకు తీవ్రగాయమైంది. స్థానికుల సాయంలో పోలీసులు క్షతగాత్రుడిని జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. గుణుపూరుపేట వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోద చేశారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

గజపతినగరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గంజాయితో పట్టుబడిన ఇద్దరిని అరెస్టు చేశామని బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెంటాడ రైల్వేగేటు వద్ద గంజాయి విక్రయించడంతో పాటు పలువురు గంజాయి సేవిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ లక్ష్మణరావు, సిబ్బంది దాడి చేశారన్నారు. అక్కడ బొండపల్లికి చెందిన నవీన్‌కుమార్ 400 గ్రాములు, ఓ మైనర్ 300 గ్రాముల గంజాయితో పట్టుబడ్డారన్నారు. వారి నుంచి మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే మరో ఇద్దరు మైనర్లు గంజాయి తాగుతూ పట్టుబడ్డారన్నారు. ఇద్దరు మైనర్లూ ఇంటర్మీడియట్ చదువుతుండటంతో కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. గంజాయిని విక్రయిస్తున్న నవీన్ కుమార్‌తో పాటు మైనర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. డీఎస్పీతో పాటు సీఐ రమణ, ఎస్ఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తూ..

రాజాం రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రేగిడి మండలం బాలకవివలస రియల్ ఎస్టేట్‌లో గంజాయి సేవిస్తున్న నలుగురిని రేగిడి ఎస్ఐ నీలావతి శనివారం అరెస్ట్ చేశారని రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టుబడిన వారిలో ముగ్గురిలో ఓ మైనర్ కూడా ఉన్నాడన్నారు. సంతకవిటి మండలం గుళ్లసీతారాంపురం గ్రామానికి చెందిన ఓ యువకుడు గంజాయికి అలవాటు పడి పాలకొండకు చెందిన బొడ్డాన దుర్గాప్రసాద్ వద్ద గంజాయి కొనుగోలు చేశాడన్నారు. ఆ యువకుడు ఇచ్చిన సమాచారంతో నలుగురు యువకులు పాలకొండలో గంజాయి కొనుగోలు చేశారని సీఐ వివరించారు. పట్టుబడిన వారిలో ఒకరిది సంతకవిటి మండలం గుళ్లపాడు అని, మరో ఇద్దరు బిళ్లాణి గ్రామానికి చెందిన వారని సీఐ తెలిపారు. రేగిడి ఎస్ఐ నీలావతి కేసు నమోదు చేశారని సీఐ తెలిపారు.

4 కేజీల గంజాయితో..

లక్కవరపుకోట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొత్తవలసలో నాలుగు కేజీల గంజాయితో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాకేష్‌కుమార్‌ను శనివారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ సుదర్శన్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిందితుడిని పట్టుకుని తహశీల్దార్ ఎదుట హాజరుపరిచామన్నారు.

కేజీన్నర గంజాయితో..

సంతకవిటి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పొనుగుటివలస పంచాయతీ జీఎంఆర్ కళాశాల వెనకాల మామిడితోటలో కేజీన్నర గంజాయితో ఓ వ్యక్తిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నామని రాజాం సీఐ హెచ్.ఉపేంద్ర, ఎస్ఐ గోపాలరావు తెలిపారు. గంజాయిని సీజ్ చేశామన్నారు.

వ్యక్తి మృతిపై దర్యాప్తు

లక్కవరపుకోట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్లాపల్లిలో ఈనెల 9న కాలుజారి పడి లెక్కల కనక మృతి చెందిన ఘటనపై శనివారం సీఐ ఎల్.అప్పలనాయుడు సమగ్ర దర్యాప్తు నిర్వహించారు. ఎల్.కోట పోలీసులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుడు కనక తలకు బలమైన గాయం ఎలా అయింది.. ఎవరైనా కొట్టారా.. గొడవలు ఏమైనా జరిగాయా.. అంటూ చుట్టుపక్కల వారిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హెచ్‌సీ పాపారావు ఉన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

తెర్లాం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. తెర్లాం మండలంలోని వెలగవలస, రంగప్పవలస గ్రామాల మధ్యలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ సాగర్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెలగవలస గ్రామానికి చెందిన ట్రాక్టర్ పొలం పనులు ముగించుకుని, అదే గ్రామం వైపు వెళ్తోంది. అదే సమయంలో ఎం.గదబవలస గ్రామానికి చెందిన ఆరంగి పోలినాయుడు ద్విచక్ర వాహనంపై రంగప్పవలస నుంచి వెలగవలస వైపు వెళ్తున్నాడు. వెలగవలస, రంగప్పవలస గ్రామాల మధ్యలోకి వచ్చేసరికి ఎదురెదురుగా వస్తున్న ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ట్రాక్టర్ అదుపు తప్పి కాలువలోకి దూసుకు వెళ్లింది. ఈ ఘటనలో పోలినాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఒక కాలు విరిగింది. క్షతగాత్రుడిని వెంటనే స్థానిక రాజాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజాం పోలీసుల సమాచారం మేరకు, స్థానిక పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పోలినాయుడు నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యం

సీతంపేట రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): సీతంపేట గ్రామానికి చెందిన డొనక ప్రశాంతి అనే మహిళ అదృశ్యమైనట్లు ఆమె తల్లి బిడ్డిక సూరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని స్థానిక ఎస్ఐ వై.అమ్మన్నరావు శనివారం తెలిపారు. సీతంపేట పాత ఎస్టీ కాలనీకి చెందిన డి.ప్రశాంతి గత కొన్ని రోజుల నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కానిస్టేబుల్ కృష్ణకిశోర్ సస్పెన్షన్

నెల్లిమర్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గంజాయి కోసం చేపట్టిన సోదాల్లో చేతివాటం ప్రదర్శించిన నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఎస్.కృష్ణకిశోర్‌ను సస్పెండ్ చేసినట్లు ఎస్పీ వకుల్ జిందల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కిందట నెల్లిమర్ల పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు నెల్లిమర్ల ఎస్ఐ, సిబ్బంది.. ఓ విద్యార్థి గదిలో చేపట్టిన సోదాల్లో కృష్ణకిశోర్ చేతివాటం ప్రదర్శించినట్టు పోలీసు అధికారుల విచారణలో వెల్లడైందన్నారు. దాంతో ఆయన్ని సస్పెండ్ చేశామని పేర్కొన్నారు. పోలీసుల విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేదిలేదని ఎస్పీ స్పష్టం చేశారు.

కేంద్ర మంతి ప్రకటన అభినందనీయం



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందేవారికి రూ.50 వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు ఆర్థిక సాయం చేస్తున్నట్టు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించడం అభినందనీయమని రోడ్డు సేఫ్టీ ఎన్జీవో అధ్యక్షుడు మజ్జి అప్పారావు అన్నారు. శనివారం ఆర్అండ్‌బీ సమీపంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఎన్జీవో సంస్థలో చేస్తున్న సేవలను గుర్తించి హిట్ అండ్ రన్, డీసీఎల్ కమిటీ సభ్యుడిగా తన పేరును నామినేట్ చేసినందుకు కలెక్టర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకంపై కరపత్రాలను ఆయన విడుదల చేశారు. సమావేశంలో సభ్యులు ఎ.కృష్ణారావు, డి.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి

సాలూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం సాధికారత సాధించి, ఆర్థికంగా ఎదగాలని గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా, హోం ట్రయాంగిల్ సంయుక్త ఆధ్వర్యంలో సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మెప్మా పట్టణ ప్రాంతాల్లో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరారు. ఉపాధి అవకాశాలను కల్పించటం తోపాటు చిన్న తరహా వ్యాపారాలను ప్రోత్సహించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. నియోజకవర్గంలో కేవలం వంద రోజుల్లో వంద రహదారులను నిర్మించినట్టు గుర్తుచేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అంగరంగ వైభవంగా శ్యామలాంబ అమ్మవారి పండుగను జరిపించుకోవాలని కోరారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, కౌన్సిలర్లు వైదేహి, హర్షవర్ధన్, వరలక్ష్మి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బకాయిలు చెల్లించాలి

బొబ్బిలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల ద్వారా 2021-22 సంవత్సరంలో రైసుమిల్లులకు ధాన్యాన్ని తరలించిన రైతులకు రావల్సిన రవాణా చార్జీల బకాయిలను వెంటనే చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి గోపాలం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం స్థానిక పీఏసీఎస్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి వైసీపీ ప్రభుత్వం రైతులకు లోడింగ్, అన్‌లోడింగ్, రవాణా చార్జీలు ఇస్తామని ప్రకటించడంతో రైతులందరూ తమ సొంత సొమ్ము ఖర్చు పెట్టి రవాణా చేశారన్నారు. అయితే ఆ నిధులను ప్రభుత్వం సొసైటీలకు విడుదల చేసిందని, కానీ సొసైటీలు రైతులకు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. సొసైటీ అధికారులు తక్షణం స్పందించి రైతులకు రావాల్సిన లోడింగ్, అన్‌లోడింగ్, రవాణా చార్జీలను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే దీనిపై రైతులతో కలిసి ఆందోళన చేస్తామని గోపాలం తెలిపారు.

సీఎం సహాయ నిధి పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి/బాడంగి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి గ్రామానికి చెందిన బోనెల జయలక్ష్మికి ఎమ్మెల్యే బేబీనాయన సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. బోనెల జయలక్ష్మి అనారోగ్యానికి గురైన విషయం ఎమ్మెల్యే దృష్టికి రావడంతో సీఎం సహాయ నిధి నుంచి రూ.80వేలను మంజూరు చేయించారు. ఆ చెక్కును బొబ్బిలిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన శనివారం అందజేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

బొబ్బిలి/బాడంగి, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వాడాడ గ్రామంలో అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన వాడబోయిన సన్యాసి కుటుంబానికి ఎమ్మెల్యే బేబీనాయన చేయూతనందించారు. శనివారం ఆయన బొబ్బిలిలోని తన క్యాంపు కార్యాలయంలో బాధితులకు ఆర్థిక సాయంతోపాటు కిరాణా సరుకులు, దుప్పట్లు అందించారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నేత శంకరరావు

బొబ్బిలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈనెల 13న భోగిమంటల్లో బిల్లు కాపీలను దహనం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి.శంకరరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ డిమాండ్‌లతో వినియోగదారులంతా భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సురేష్, పుణ్యవతి, గోపాలం పాల్గొన్నారు.

అప్పుడలా.. ఇప్పుడిలా..

● రహదారులకు చురుగ్గా మరమ్మతులు




నాడు నడిమికెళ్లలో గుంతలతో ఉన్న రహదారి, నేడు ఇలా..

వీరఘట్టం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహదారుల్లో ఏర్పడిన గోతులను గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. నేడు కూటమి ప్రభుత్వం రహదారులు మరమ్మతులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి, పనులు చేపడుతోంది. దీనికి నడిమికెళ్ల గ్రామంలో రహదారి నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

నూతన విధానాల మేరకు పనులు చేపట్టాలి

గరుగుబిల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం నూతనంగా విధించిన విధానాల మేరకు పనులు నిర్వహించాలని ఏపీవో ఎం.గౌరీనాథ్ సూచించారు. ఈ మేరకు శనివారం గరుగుబిల్లిలో ఉపాధి హామీ సిబ్బందికి అవగాహన కల్పించారు. వేతనదారునికి రూ.300 గిట్టుబాటు అయ్యేలా కొలతలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

పార్వతీపురంటౌన్, జనవరి 11(ఆంధ్ర జ్యోతి): కార్మికుల కళ్లల్లో సంతోషం చూడడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పారిశుధ్య నిర్వహణ కార్మికులకు ఆయన దుస్తులు, సబ్బులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణతో అవరోధాలు అధిగమించవచ్చు

ఒడిశా

రాయగడ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణతో జీవితంలో ఎదురయ్యే అనేక అవరోధాలను అధిగమించవచ్చని అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రౌయిత్ అన్నారు. స్థానిక అటానమస్ కళాశాలలో గత వారం రోజులుగా విద్యార్థినులకు ఆత్మరక్షణపై నిర్వహించిన శిబిరం శనివారంతో ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ బాబిలత షరాఫ్ అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. అనంతరం శిబిరంలో శిక్షణ పొందిన 320 మంది విద్యార్థినులకు ముఖ్య అతిథి చేతులమీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. కేకే జానీ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

పండగ సందడి



డెంకాడ: చింతలవలసలోని ఐదో పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ మల్లికాగార్గె ఆధ్వర్యంలో..

● పాఠశాలు, కళాశాలల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి పండగను పురస్కరించుకుని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో శనివారం ముందస్తుగా సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు వేశారు. కోలాటం, ముగ్గులతో విద్యార్థినులు సందడి చేశారు. హరిదాసు వేషధారణతో విద్యార్థులు అలరించారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అలాగే డెంకాడలోని ఐదో పోలీసు బెటాలియన్‌లో కూడా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



రాజాం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముగ్గుల పోటీ నిర్వహిస్తున్న దృశ్యం



ఎస్.కోట రూరల్: వెంకటరమణపేట అంగన్‌వాడీ కేంద్రంలో..



బొబ్బిలి రూరల్: రాజచెరువువలసలో చిన్నారుల కోలాటం



గరుగుబిల్లి: గొట్టివలస అంగన్‌వాడీ కేంద్రంలో..

మినీ గోకులాలు ప్రారంభం

● పశు సంపద సంరక్షణకు ప్రభుత్వం చర్యలు: విప్ జగదీశ్వరి

● గ్రామాభివృద్ధి కోసమే పల్లె పండుగ: పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర

గుమ్మలక్ష్మీపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పశు సంపదను సంరక్షించే విధంగా కూటమి ప్రభుత్వం గోశాలలను నిర్మిస్తోందని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ కలిగొట్టు గ్రామంలో, గుమ్మలక్ష్మీపురంలోని కొండవీధిలో, దుమ్మంగి పంచాయతీ గుణద గ్రామాల్లో ఉపాధి నిధులతో నిర్మించిన గోశాలలను ఆమె శనివారం ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో టీడీపీ మండల కన్వీనర్ పాడి సుదర్శనరావు, ఎంపీడీవో సాల్మన్‌రాజు, జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేశ్వరరావు, డీటీ శేఖర్, సర్పంచ్ క్రాంతి పాల్గొన్నారు. ● కురుపాం: మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన గోకులాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం ప్రారంభించారు. ఎంపీడీవో యు.ఉమామహేశ్వరి, ఉపాధి ఏపీవో పి.బావాజీ, ఈవోపీ ఆర్డీ రమేష్, టీడీపీ మండల కన్వీనర్లు కేవీ కొండయ్య, పాడి సుధ, మాజీ ఎంపీపీ జీవీ రమణమూర్తి, జనసేన మండల అధ్యక్షుడు ఎస్.వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ● బొబిలి రూరల్: మండలంలోని 12 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం, పశు సంవర్థక శాఖ సమన్వయంతో నిర్మించిన మినీ గోకులం షెడ్లను శనివారం ప్రారంభించారు. పారాది సచివాలయం పరిధి బంకురువలస గ్రామంలో పశు సంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.విష్ణు ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎ.బాస్కరరావు సమక్షంలో గోకులం షెడ్‌ను ప్రారంభించారు. ఎంపీడీవో పి.రవికుమార్, ఏపీవో లక్ష్మీపతిరాజు, ఈవోపీఆర్డీ ఎ.భాస్కరరావు, టెక్నికల్ సహాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ● రామభద్రపురం: ముచ్చర్లవలస గ్రామంలో నిర్మించిన గోకులాన్ని ఎంపీటీసీ సభ్యురాలు మడక స్వర్ణలత శనివారం ప్రారంభించారు. ఎంపీడీవో రత్నం, ఏపీవో గొలగాని త్రినాథరావు పాల్గొన్నారు. ● సీతానగరం: గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని అమలు చేసిందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. పల్లె పండుగలో భాగంగా చిన్నరాయుడుపేటలో నిర్మించిన మినీ గోకులాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. పశు వైద్యాధికారి రామారావు, టీడీపీ నాయకులు రౌతు వేణుగోపాల్‌నాయుడు, పెంట సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు. ● పార్వతీపురం: నర్సిపురం పంచాయతీ విశ్వంభరాపురంలో మినీ గోకులాలను టీడీపీ నాయకుడు గొట్టాపు వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు తవిటినాయుడు శనివారం ప్రారంభించారు. సర్పంచ్ బంగారమ్మ పాల్గొన్నారు. ● పార్వతీపురం రూరల్: ఎంఆర్ నగరంలో నిర్మించిన గోశాలలను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శనివారం ప్రారంభించారు. టీడీపీ నాయకులు బోనుదేవి చంద్రమౌళి, గొట్టాపు వెంకటునాయుడు, వంగపండు త్రినాథనాయుడు, సర్పంచ్ వంగపండు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ● గరుగుబిల్లి: చిలకాం పంచాయతీ పరిధిలో నిర్మించిన గోశాలలను టీడీపీ బీసీ సెల్ అరకు పార్లమెంటరీ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ శనివారం ప్రారంభించారు.



కురుపాం: మినీ గోకులాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి



సీతానగరం: గోకులం ప్రారంభోత్సవంలో భాగంగా గోవుకు అరటిపండు తినిపిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

న్యూస్ బాక్స్

రహదారి భద్రత పాటించండి

సీతంపేట రూరల్, జనవరి 11(ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు రహదారి భద్రత పాటించాలని స్థానిక ఎస్ఐ వై.అమ్మన్నరావు సూచించారు. శనివారం స్థానిక పీఎంఆర్‌సీ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహన చోదకులకు ఆయన రహదారి ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయండి

జామి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే లలితకుమారిని జడ్పీటీసీ మాజీ సభ్యుడు బండారుపెదబాబు కోరారు. శనివారం ఆయన ఎమ్మెల్యేను కలిసి మాట్లాడారు. జామి మండలానికి ప్రభుత్వం 17 వేల టన్నుల ధాన్యం కొనుగోలుకే అనుమతి ఇచ్చిందని, ఇంకా రైతుల వద్ద 12 వేల టన్నుల ధాన్యం ఉందని వివరించారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం నుంచి అనుమతులు తెప్పించి కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో పైడిబాబు వున్నారు.

ఘనంగా కందికొత్తల పండగ

సీతంపేట రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలోని జల్లార గిరిజన గ్రామంలో శనివారం కందికొత్తల పండగను ఘనంగా నిర్వహించారు. గొడ్డలి, కందిపువ్వులతో కూడిన కొమ్మలను కలిపి ఒకచోట ఉంచి థింసా నృత్యం చేశారు. కొత్తగా వచ్చిన కందిపప్పును తినడానికి ఒక ముహూర్తం నిర్ణయించి దానిని పండగగా చేసుకుంటామని సర్పంచ్ బిడ్డిక సోమేసు తెలిపారు.

షర్మిలకు వినతిపత్రం

బొబ్బిలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ మత సంస్థకు చెందిన పాఠశాల కొనుగోలు వ్యవహారంపై పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం వినతిపత్రం సమర్పించారు. విశాఖలో షర్మిలను కలిసి ఈ సమస్యను నివేదించినట్టు డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్, నియోజకవర్గ ఇన్‌చార్జి ముప్పల శ్రీనివాస్‌లు తెలిపారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల వ్యవహారం వివాదాస్పదంగా మారడంతో దీనిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకునేలా ఒత్తిడి తీసుకురావాలని కోరామని తెలిపారు.

చాలీచాలని ఆదాయంతో..

● కుటుంబాన్ని నెట్టుకొస్తున్న హరిదాసులు, జంగందేవరలు



కుటుంబ పెద్దలను గుర్తు చేస్తున్న జంగందేవర

భామిని, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి సంక్రాంతికి కనిపించే హరిదాసులు, జంగందేవరలు, గంగిరెద్దుల వారు తదితర జాతుల వారు చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. సంక్రాంతి నెల రోజుల ముందు నుంచి గ్రామాల్లో తిరిగి ఇంటింటా జోగి దండడం వారి వృత్తి. ఈ నెల రోజుల పాటు సేకరించిన విరాళాలు ఏడాది పాటు సరిపెట్టుకుంటూ కుటుంబాన్ని నెట్టుకు రావాల్సి పరిస్థితి ఉంది.

గ్రామాల్లో గంగిరెద్దుల సందడి



గరుగుబిల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో గ్రామాల్లో గంగిరెడ్ల సందడి నెలకొంది. మండలంలోని పలు గ్రామాల్లో గంగిరెద్దులను ఇంటింటికి తిప్పుతూ కానుకలు స్వీకరించారు.

ఆరోగ్య సేవలపై నిర్లక్ష్యం వద్దు

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు



వైద్య సేవలపై వృద్ధులను అడిగి తెలుసుకుంటున్న జగన్మోహనరావు

గరుగుబిల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యో తి): గ్రామాల్లో ఆరోగ్య సేవలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి తెర్లి జగన్మోహనరావు హెచ్చరించారు. మండ లంలోని పెదగుడబ, సన్యాసిరాజుపేట గ్రామాల్లో వైద్య సేవలపై ఆయన శనివా రం ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన గ్రామాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గర్భిణులకు కిల్కారీ ఫోన్ కాల్స్‌పై ఆరా తీశారు. గర్భిణులు ఆరోగ్య వంతంగా ఉండేలా పర్యవేక్షణ చేయాలని సిబ్బందికి సూచించారు. చిన్నారులకు టీకాల నిర్వహణతో పాటు రక్తహీనతకు గురికాకుండా ఉండేందుకు అవసరమైన మందులు సరఫరా చేయాలన్నారు. ఈ పరిశీలనలో సూపర్‌వైజర్ జయగౌడ్, సిబ్బంది రమణమ్మ, ఇంద్రాణితో పాటు ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు

● గ్రామాల్లో ప్రజలకు పోలీసుల హెచ్చరిక

సీతానగరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎక్కడైనా కోడి పందేలు, పేకాట ఆడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఎం.రాజేష్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సంక్రాంతి పండుగ రోజుల్లో సంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కోడి పందేలు, పేకాట నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో ఎక్కడైనా కోడి పందేలు, జూదం ఆడితే 9121109457 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ● మక్కువ: సంక్రాంతి పండగను మండల ప్రజలు సక్రమంగా జరుపుకోవాలని ఎస్ఐ ఎం.వెంకటరమణ మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలో పేకాట, కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నియమాలు ఉల్లంఘిస్తే జైలు శిక్ష తప్పదన్నారు. ● బొబ్బిలి రూరల్: గ్రామాల్లో కోడి పందేలు, గొర్రి పందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని బొబ్బిలి సీఐ కె.సతీష్‌కుమార్ హెచ్చరించారు. శనివారం ఎ.వెలగవలస గ్రామంలో ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీను, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంయమనం పాటించాలి: డీఎస్పీ



కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధి గొల్ల వీధిలో చర్చి నిర్మాణంపై వివాదం నెలకొన్న నేపథ్యంలో శనివారం బొబ్బిలి పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక హిందూ, క్రైస్తవ నాయకులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరువర్గాల వారు సంయమనం పాటించవలసినదిగా సూచించారు. వివాద స్థలంలో పోలీసు పికెట్ కొనసాగుతుందని, శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన ఇరువర్గాలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీను, సీఐ కె.సతీష్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

భీమసింగి కర్మాగారంపై దృష్టి పెట్టండి

● మంత్రిని కోరిన లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి



మాట్లాడుతున్న బీశెట్టి బాబ్జీ

జామి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా మూతపడిన భీమసింగి సుగర్స్‌పై జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టి సారించాలని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. శనివారం ఆయన జామిలో విలేకరులతో మట్లాడారు. గత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ఫ్యాక్టరీని మూసేసిందన్నారు. అబద్ధాలు చెప్పి అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేలు.. రైతులు, కార్మికులను మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలోనైనా దీన్ని తెరిపించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు. భీమసింగి ప్రాంతానికి పూర్వవైభవం తీసుకురావాలని మంత్రి శ్రీనివాస్‌కు ఆయన విన్నవించారు.

నేడు 'తోటపల్లి' సర్వ సభ్య సమావేశం

గరుగుబిల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ఆలయ అభివృద్ధి సేవా ట్రస్టు సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం స్థానిక ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తామని టీటీడీఎస్‌టీ ప్రధాన కార్యదర్శి డొల్లు పారినాయుడు తెలిపారు. ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. టీటీడీఎస్‌టీని ఏర్పాటు చేసి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో ట్రస్టు సభ్యులందరితో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహి స్తున్నామని చెప్పారు. టీటీడీఎస్ సభ్యులంద రూ ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.